సాక్షి
కృష్ణాజిల్లా

బుధవారం । 8 । జనవరి । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరు చంద్రమౌళినగర్‌కు చెందిన వ్యామజాల శివరామయ్య కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది.



విద్యార్థుల్లో అద్భుత ప్రతిభ

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ ఉందని మంత్రి నారా లోకేష్ అన్నారు. నగరంలో జరుగుతున్న పాలిటెక్ ఫెస్ట్‌ను లోకేష్ సందర్శించారు. -IIలో▸

దుర్గమ్మ సేవలో..



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలతో ఆయనను సత్కరించారు.

న్యూస్‌రీల్

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ చెస్ జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం చదరంగం జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి ప్రకటించారు. జట్టుకు బి.దీపక్ (ప్రభుత్వ వైద్య కళాశాల, అనంతపురం), కె.లోకేష్ (ప్రభుత్వ వైద్య కళాశాల, అనంతపురం), కె.అభినవ్ చంద్ర (సిద్ధార్థ మెడికల్ కాలేజీ, విజయవాడ), కె.త్రివేద్‌కుమార్ (సిద్ధార్థ మెడికల్ కాలేజీ, విజయవాడ), ఎస్.టెండుల్కర్ (ప్రభుత్వ వైద్య కళాశాల, నంద్యాల), ఎ.రత్నాకర్(సెయింట్ జోసఫ్ దంత కళాశాల, ఏలూరు) ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల ఎనిమిది నుంచి 11వ తేదీ వరకు చెన్నైలో జరిగే దక్షిణ భారత అంతర వర్సిటీల చదరంగం పోటీలకు ఈ జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. జట్టు బృందాన్ని హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాధికరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అభినందించారు.

కలిసికట్టుగా జీవించడమే క్రైస్తవ్యం



ఉంగుటూరు: ఎటువంటి తారతమ్య భేదాలు లేకుండా ప్రజలు అందరూ కలసికట్టుగా ముందుకు సాగే ప్రయాణమే క్రైస్తవ జీవితమని విశాఖ మేత్రాసనం, కోడూరు మాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ పసుపులేటి యుగల్ కుమార్ అన్నారు. మండలంలోని పెద్ద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు మంగళవారం నాల్గో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఫాదర్ యుగల్ పుణ్యక్షేత్ర ఫాదర్‌లతో కలసి దివ్య పూజాబలిని సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీసభ, క్రైస్తవుల సమూహ ప్రయాణం అనే అంశంపై ప్రసంగించారు. క్రీస్తు నందు విశ్వాసంతో అందరు ఐక్యంగా జీవించాలని బోధించారు. ఫాతిమానగర్ సంఘస్తులు, ఎఫ్‌సీసీ సిస్టర్స్ భక్తిగీతాలతో కొనియాడారు. పుణ్యక్షేత్ర రెక్టర్ పాలడుగు జోసఫ్, విచారణ గురువు గోపి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విశాఖపట్నం పెందుర్తికి చెందిన శ్రీ నిర్మల నృత్య నికేతన్‌కు చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై మంగళవారం సాయంత్రం పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరిగింది. బి.విజయజ్యోతి పర్యవేక్షణలో కళాకారుల బి. సాయిశ్రీ, సర్వాణిదేవి, రేణుకాసాయి, డి.పూజ, శ్రీసాహితీ, జి.మేఘన, కె. సాహితీ కృష్ణలతో పాటు పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

హోరాహోరీగా వాలీబాల్ టోర్నీ

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) జాతీయ అండర్-19 బాలికల వాలీబాల్ పోటీలు మంగళవారం రెండో రోజు హోరాహోరీగా సాగాయి. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కాలేజీ మైదానంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. రెండో రోజుల పాటు జరిగిన లీగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, సీఐఎస్‌ఈ, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, పంజాబ్, మహారాష్ట్ర, కేరళ, గుజరాత్, పశ్చిమబెంగాల్ జట్లు ముందజలో కొనసాగుతున్నాయి. వీటిల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, సీఐఎస్‌ఈ, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాలు పూల్ విన్నర్లుగా నిలిచి ప్రీ క్వార్టర్స్‌కు చేరినట్లు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత వెల్లడించారు. మరో పది జట్లు ప్రీ క్వార్టర్స్‌కు వస్తాయని, బుధవారం నుంచి ప్రీ క్వార్టర్స్ పోటీల్లో జట్లు తలపడతాయని వారు వివరించారు. బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు క్యాంప్‌ఫైర్ ఉంటుందని తెలిపారు. ఈ నెల పదో తేదీ వరకు జరిగే ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాల జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. మంగళవారం జరిగిన పోటీలను భారత సీనియర్ వాలీబాల్ కోచ్ జి.వి.ప్రసాద్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు నాదెళ్ల బ్రహ్మజీ పరిశీలించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.



మాతృగండం!

గర్భిణుల ప్రాణాల మీదకు తెస్తున్న రక్తహీనత

పెడన మండలం కూదూరుకు చెందిన ఓ మహిళను ఇటీవలే పురిటి నొప్పులతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే ఆమెకు రక్తహీనత ఉండడంతో (6.7శాతం) అక్కడి వైద్యులు చేతులెత్తేసి, ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమెకు వైద్యులు రక్తం అందించి, ప్రసవం చేసేందుకు ప్రయత్నించినా.. చివరకు ఫలితం లేక మృత్యువాత పడింది. రక్తహీనత సమస్య ఆ కుటుంబంలో చీకటిని నింపింది.

- గ్రామీణ ప్రాంత మహిళల్లో అధికంగా సమస్య
- ప్రసవ సమయంలో తీవ్ర ప్రభావం
- గత ఏడాది ప్రసవ సమయంలో 16 మంది మృతి
- అధికారికంగా జిల్లాలో 16,533 మందిలో రక్తహీనత
- ఈ సంఖ్య మరింత ఎక్కువే ఉంటుందంటున్న నిపుణులు

సాక్షి, మచిలీపట్నం: రక్తహీనత కారణంగా ప్రసవ సమయంలో కాబోయే తల్లులు తల్లడిల్లుతున్నారు. పెళ్లయి పిల్లల కోసం ప్రయత్నించే మహిళలకు రక్తహీనత (ఎనీమియా)పై అవగాహన లేకపోవడం, తగిన నివారణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రసవం వేళ ప్రాణాల మీదకు వస్తోంది. ముఖ్యంగా రక్తహీనత గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా కనిపిస్తోంది. ఇది నియంత్రించదగినదే అయినా.. పూర్తి స్థాయిలో సాధ్యం కావడం లేదు. ఈ సమస్య కారణంగా వేలాది మంది మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు మహిళల్లో ఈ లోపం ఎక్కువగా ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడిస్తోంది. అధికారికంగా సగటున 16.39శాతం ఉందని చెబుతున్నా.. 32శాతానికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. సరైన పౌష్టికాహారం లేకపోవడం, దీన్ని నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకపోవడంతో అనేక ఇబ్బందులకు దారితీస్తోంది.

రక్తహీనతకు సంకేతాలు..

- శారీరకంగా బలహీనంగా ఉండడం
- శరీరం పసుపు రంగులో ఉండడం
- శ్వాస సరిగా తీసుకోలేకపోవడం
- ఛాతీలో అప్పుడప్పుడూ నొప్పి రావడం
- అరచేతులు, అరికాళ్లు చల్లగా ఉండడం
- తరచూ తలనొప్పి రావడం



ప్రమాదకర పరిస్థితులు..

రక్తహీనతతోనే బాధపడుతున్నవారు సివియర్ ఎనీమియా (అత్యల్పంగా రక్తం ఉండటం) వల్ల ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాంటీనేటల్ చెకప్ (గర్భిణిగా ఉన్నప్పుడు నెలసరి వైద్యపరీక్షలు)కు వచ్చినప్పుడు రక్తహీనత ఉన్న మహిళలకు ఐరన్, విటమిన్ ట్యాబ్లెట్లు ఇవ్వడంతో పాటు తప్పనిసరిగా వాడేలా సలహాలు ఇవ్వాలి. రక్తహీనత వల్ల ఎక్కువ మంది సుఖ ప్రసవం కాలేకపోతున్నారు. డెలివరీ సమయాల్లో మాతృ మరణాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని పరిస్థితుల్లో కడుపులోనే బిడ్డ మృతి చెందే అవకాశమూ ఉంది. ఇలాంటి పరిస్థితులు తల్లికీ గండంగా మారుతాయి.

11 శాతం పైన ఉంటే మంచిది..

మహిళల్లో సగటున 11 శాతం, ఆపై హిమోగ్లోబిన్ ఉండడం మంచిది. కానీ 25 ఏళ్ల వయసున్న కొందరు మహిళల్లో హిమోగ్లోబిన్ 8 శాతం కూడా లేదని తెలుస్తోంది. ఈ సమస్య కారణంగా మహిళలు ఇతర జబ్బుల నుంచి కూడా త్వరగా కోలుకోలేకపోతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఆకు కూరలతో పాటు కూరగాయలు, ఐరన్ ఆహారం అధికంగా తినాలి. ఎలాంటి రక్తహీనత లేకపోయినా బిడ్డ ఎదుగుదలకు 180 ఐరన్ ట్యాబెట్లు, ఎనీమియా ఉంటే 360 ట్యాబెట్లు వాడాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ముందుగానే చేరితే అవసరమైన ఐరన్ మందులు వేస్తారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

- కృష్ణా జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 2024-25లో 1,23,897 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా హిమోగ్లోబిన్ 11 నుంచి 16శాతం మధ్య ఉన్న వారు 1,07,364 మంది ఉన్నారు. ఇది నార్మల్.
- మైల్డ్ విభాగంలో 10 - 10.9శాతం మధ్య 15,251 మంది, యావరేజ్‌గా 7-9.9శాతం మధ్య 1267 మంది, సివియర్‌లో 6- 6.9శాతం మధ్య 15 మంది నమోదయ్యారు. మొత్తం 16,533 మంది ఎనీమియాతో ఇబ్బంది పడుతున్నారు.
- జిల్లాలో 2023-24లో 16 మంది చనిపోగా 2024-25లో ఇప్పటి వరకూ 10 మంది చనిపోయారు.

ప్రతి నెలా పరీక్షలు తప్పనిసరి..



ప్రెగ్నెన్సీ ఖరారు అయిన ప్రతి మహిళ నెలనెలా రక్త పరీక్షలు చేయించుకోవాలి. నార్మల్ డెలివరీ సమయంలో 200 ఎంఎల్ నుంచి 300 ఎంఎల్ వరకు రక్తం పోతుంది. ఆపరేషన్ జరిగితే అర లీటర్ వరకు పోతుంది. ఎలాంటి రక్తహీనత లేకపోయినా 180 ఐరన్ మాత్రలు వాడాలి. సమస్య ఉంటే 360 ట్యాబ్లెట్స్ వాడాలి. అప్పుడు తల్లి, బిడ్డకు మంచిది. లేకపోతే రక్తహీనత తల్లీబిడ్డకు ఇద్దరికీ ప్రమాదమే.

– డాక్టర్ ఎస్. శర్మిష్ఠ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

ఏడో రోజు కొనసాగిన పోలీస్ సెలక్షన్స్

పరిశీలించిన ఎస్పీ గంగాధరరావు



సెలక్షన్స్‌ను స్వయంగా పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ సెలక్షన్స్ ఏడో రోజు కొనసాగాయి. మంగళవారం జరిగిన సెలక్షన్స్‌కు 600 మంది అభ్యర్థులకుగానూ 284 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. సెలక్షన్స్‌లో ఇటీవల జరిగిన పలు సంఘటనలను దృష్టిలో పెట్టుకున్న జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అభ్యర్థులు ఎటువంటి అనారోగ్యం, అస్వస్థతకు గురికాకుండా ఉండేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నారు. సెలక్షన్స్‌కు హాజరైన అభ్యర్థులు నీరసించకుండా ఉండేందుకు గ్రౌండ్‌లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయించారు. పరుగు పందెంలో అభ్యర్థులు సొమ్మసిల్లకుండా ఉండేందుకు గ్లూకోజ్‌తో పాటు పలు ఆరోగ్యకరమైన పానీయాలను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులతో ఆయన స్వయంగా మాట్లాడి సెలక్షన్స్‌కు ఏ విధంగా సిద్ధం కావాలి, మానసిక ఒత్తిడి నుంచి ఏ విధంగా ఉపశమనం పొందాలి వంటి విషయాలను వివరించి, వారిలో ఆత్మస్థైరాన్ని నింపారు. 284 మందిలో 184 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించగా మిగిలిన 100 మంది డిస్‌క్వాలిఫై అయ్యారు. అనారోగ్య కారణాల చేత ఎవరైనా సెలక్షన్స్‌కు హాజరుకాలేని పక్షంలో తనను స్వయంగా కలిసి విషయాన్ని వివరించాలని కోరారు. వారికి ఈ నెల 20వ తేదీన పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు



మాట్లాడుతున్న డీఆర్వో చంద్రశేఖరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖరరావు అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారులకు సహిత విద్య, బడి బయట విద్యార్థుల నమోదు తదితర అంశాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్వో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం పాఠశాలల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యార్థులకు అందించాల్సిన సామగ్రి, మధ్యాహ్న భోజన పథకం, ఉపకరణాలు అందించటం, వైద్యశిబిరాలు నిర్వహించటం వంటివి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు బోధన అభ్యసన సామగ్రి, కిట్లను పంపిణీ చేయాలన్నారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎ రాములునాయక్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా బోధన, అలవెన్సులు అందించటం, ఫిజియోథెరపీ, ఉపకరణాల పంపిణీ చేపడుతున్నామన్నారు. సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఐఈడీ కో-ఆర్డినేటర్ పి వనజ, సమగ్ర శిక్ష సహిత విద్య కో-ఆర్డినేటర్ ఎస్. రాంబాబు, సెక్టోరియల్ సిబ్బంది డి. గణేష్, టి. రమేష్, అబ్దుల్ సుభాన్, కె. ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు 'కిట్స్' పంపిణీ



విద్యార్థినికి కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ, డీఆర్వో

మచిలీపట్నంటౌన్: సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని వృద్ధిలోకి రావాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యార్థులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్‌ఓ కె. చంద్రశేఖరరావులతో కలిసి కలెక్టర్ స్థానిక బచ్చుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల నాలుగో నంబర్ వసతి గృహాన్ని మంగళవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్, స్కేల్, జామెంట్రీ బాక్స్, కొబ్బరి నూనె, ఫేస్ పౌడర్, హెయిర్ పిన్స్, టవల్, నాప్కిన్‌లతో కూడిన కిట్స్ అందజేశారు. వసతి గృహంలోని ప్రతిరూముకు మస్కిటో రీఫిల్స్, మెషిన్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, అందుకు తగిన విధంగా కష్టపడి పని చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించి వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం కలెక్టర్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మధుసూదన్ రావు, ఏఎస్‌డబ్ల్యూఓ శీలం రాజశేఖర్ రెడ్డి, హెచ్‌డబ్ల్యూఓ సూర్య బేగం పాల్గొన్నారు.

గ్రీన్‌కో గెస్ట్ హౌస్‌పై తెలంగాణ ఏసీబీ దాడులు



గ్రీన్‌కో గెస్ట్ హౌస్ వద్ద తెలంగాణ ఏసీబీ అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లా మచిలీపట్నం నగరంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న గ్రీన్ కో కంపెనీకి చెందిన గెస్ట్‌హౌస్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఏసీబీ, వివిధ శాఖల అధికారులు దాడులు నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు గెస్ట్‌హౌస్ వద్దకు అధికారులు చేరుకున్నారు. గెస్ట్ హౌస్‌లో ఉన్న సెక్యూరిటీ గార్డుతో మాట్లాడి నిర్వాహకులను పిలిపించారు. అనంతరం సంస్థ పెద్దలతో మాట్లాడి అధికారులు 11 గంటలకు లోపలకు వెళ్లారు.

ఫార్ములా-ఈ రేసు కేసులో భాగంగా..

తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వంలో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసులో ఏసీఈ డెవలపర్స్ భాగస్వామ్యులయ్యారనే కారణంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లుగా తెలుస్తోంది. సాయంత్రం 6 గంటల వరకు తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే తనిఖీల అనంతరం మీడియాకు వివరాలు తెలియపరుస్తారా అని ప్రశ్నించగా వారు తమదేమి లేదని ఉన్నతాధికారులు చెప్పిన మీదట తాము తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు.

నాడు హడావుడి చేసి.. నేడు ముఖం చాటేసి!

మల్లవల్లి భూ నిర్వాసితుల గోడు వినని డీసీఎం పవన్

- మంగళగిరి జనసేన కార్యాలయం వద్ద రోజంతా పడిగాపులు
- నాడు ప్రతిపక్షంలో ఉండగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన పవన్
- అధికారంలోకి వచ్చి ఎనిమిది మాసాలు గడిచినా పట్టించుకోని వైనం
- పరిహారం చెల్లించకుండా దౌర్జన్యంగా భూములు స్వాధీనం



మంగళగిరిలోని జనసేన కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్న మల్లవల్లి భూనిర్వాసితులు


సాక్షి ప్రతినిధి, విజయవాడ/హనుమాన్‌జంక్షన్ రూరల్: గోడు వినలేదు.. కనికరం చూపలేదు.. కనీసం కలిసేందుకు అవకాశం ఇవ్వలేదు. నాడు హామీ ఇచ్చారు కదా.. ఇప్పుడు అధికారంలో ఉన్నారు కదా.. అని ఆశతో వస్తే.. ముఖం చాటేశారు. రోజంతా ఎదురుచూసినా ఫలితం దక్కలేదు. ఇక చేసేది లేక నిరాశతో వెనుదిరిగారు. ఇదీ మంగళవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్ద డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు వచ్చిన మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడ నిర్వాసితుల పరిస్థితి. 2019 ఎన్నికల ముందు స్వయంగా మల్లవల్లి వచ్చి భూ నిర్వాసితుల ఆందోళనకు మద్దతు తెలపటంతో పాటుగా, అధికారంలోకి రాగానే బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన పవన్ కల్యాణ్ ఇప్పుడూ ముఖం చాటేయటంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు.

అసలు విషయం ఏమిటంటే..

2016లో పారిశ్రామికవాడ ఏర్పాటుకు మల్లవల్లిలోని రీ సర్వే నంబర్-11లో 1360 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. అప్పటికే ఆ భూములను సాగు చేస్తున్న రైతులను గుర్తించేందుకు జియోకాన్ అనే సంస్థతో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 623 మంది సాగుదారులు ఉన్నట్లు నివేదిక ఇవ్వగా, ఆ తర్వాత రెవెన్యూ అధికారులు 716.44 ఎకరాల్లో 490 మంది సాగుదారులు ఉన్నట్లుగా తుది జాబితాను ప్రకటించారు. కానీ వివిధ కారణాలతో చివరికి 443 మంది రైతులకు గానూ 615.6 ఎకరాలకు మాత్రమే రూ.7.50 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని పంపిణీ చేశారు. దీంతో పరిహారం దక్కని సాగుదారులు ఎనిమిదేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సాగుదారుల లెక్క తేల్చే విషయంలో రెవెన్యూ అధికారులపై నాటి టీడీపీ నాయకుల ఒత్తిడితోనే పలువురి పేర్లు తుది జాబితాలో గల్లంతయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గుడివాడ ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయగా, 217 మంది సాగుదారులు 713 ఎకరాలకు నష్టపరిహారం దక్కలేదని అర్జీలు దాఖలు చేశారు.

పవన్‌కల్యాణ్, లోకేష్ హడావుడి హామీలు..

నష్టపరిహారం అందని సాగుదారులు పలు దఫాలుగా ఆందోళనలు చేపట్టారు. ఏపీఐఐసీ ఇప్పటికే పరిశ్రమలకు భూకేటాయింపులు చేయటంతో ఆ సంస్థలు చేపట్టిన నిర్మాణాలను సాగుదారులు అడ్డుకుంటూ నిరసనలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ఆగస్టులో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మల్లవల్లి పారిశ్రామికవాడలో పర్యటించారు. నష్టపరిహారం అందని సాగుదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ మల్లవల్లి గ్రామానికి వచ్చినప్పుడు బాధితులు తమ గోడును విన్నవించగా న్యాయం చేస్తానని హామీనిచ్చారు. ఈ హామీలను నమ్మిన భూనిర్వాసితులు ఇప్పుడు నెత్తికొట్టుకుంటున్నారు. పవన్ కల్యాణ్‌ను కలిసి తమ కష్టాన్ని చెప్పుకునేందుకు వెళ్తే కనీసం దర్శనభాగ్యం కలగలేదంటూ వాపోతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మల్లవల్లి భూనిర్వాసితుల ఊసే పవన్ కల్యాణ్, నారా లోకేష్‌కు పట్టలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ (ఫైల్)

తాజా పరిణామాలు ఇవి..

బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో పరిహారం దక్కని రైతుల స్వాధీనంలో ఉన్న భూములను బలవంతంగా లాక్కునేందుకు కూటమి ప్రభుత్వం దౌర్జన్యకాండకు దిగింది. భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఈ నెల మూడో తేదీ నుంచి నాలుగురోజుల పాటు గ్రామాన్ని అదుపులోకి తీసుకుంది. భూనిర్వాసితులను గృహ నిర్బంధం చేసి, వారి భూములను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుంటోంది. పారిశ్రామికవాడలోకి ఇతరులను ఎవ్వరిని అనుమతించకుండా బారికేడ్లు ఏర్పాటు చేసింది. ఎనిమిదేళ్లుగా పరిహారం కోసం కళ్లు కాయలు కాసేటట్లు ఎదురుచూస్తున్న సాగుదారులను నిర్దాక్షిణ్యంగా ఇళ్లలో బంధించి, వారి భూములను బలవంతంగా లాక్కొంటున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమవుతోంది.

లాక్కోవటం తగదు..



మల్లవల్లి పారిశ్రామికవాడ భూముల్లో సుమారు 150 మందికిపైగా నష్టపరిహారం అందలేదు. దీనిపై ఎనిమిదేళ్లుగా పలు రకాలుగా ఆందోళనలు, పోరాటాలు చేశాం. ఎన్నికల ముందు పవన్ కల్యాణ్ కూడా వచ్చి న్యాయం చేస్తామని మాట ఇచ్చారు. కానీ ఇప్పుడు నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా పోలీసు బలగాన్ని అడ్డుపెట్టుకుని బలవంతంగా భూములు లాక్కోవటం సబబు కాదు.

– చిన్నాల వరప్రసాద్, భూ నిర్వాసితుల ఉద్యమ నేత, మల్లవల్లి

కోర్టు ఆదేశాలు ఉన్నా బేఖాతరు..



మల్లవల్లిలోని ఆర్‌ఎస్ నంబర్ 11లో మా కుటుంబానికి 15 ఎకరాల భూమి ఉంది. దశాబ్దాలుగా ఆ భూమిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. కానీ పారిశ్రామికవాడకు భూసేకరణ జరిగినప్పుడు మాకు నష్టపరిహారం ఇవ్వలేదు. ఈ భూమిపై గతంలోనే కోర్టు ద్వారా పర్మినెంట్ ఇంజెక్షన్ ఆర్డర్ ఉంది. అయినప్పటికీ రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు భూములు స్వాధీనం చేసుకుంటున్నారు.

– బొకినాల సాంబశివరావు, నిర్వాసితుడు, మల్లవల్లి

క్లుప్తంగా

ఖోఖో ప్రపంచ కప్ పోటీల చీఫ్ రిఫరీగా మడకా ప్రసాద్



విజయవాడస్పోర్ట్స్: ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు జరిగే ఖోఖో ప్రపంచ కప్ పోటీలకు చీఫ్ రిఫరీగా మడకా ప్రసాద్‌ను ఎంపిక చేస్తూ భారతీయ ఖోఖో సమాఖ్య ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీ ఖోఖో సంఘం కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి మంగళవారం వెల్లడించారు. గుడివాడకు చెందిన మడకా ప్రసాద్ ప్రస్తుతం ఉమ్మడి కృష్ణాజిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడిగా, రాష్ట్ర ఖోఖో సంఘం రిఫరీ బోర్డ్ కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. గతంలో జరిగిన పలు ఏషియన్, సౌత్ ఏషియన్, జాతీయ ఖోఖో పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించి దేశంలోనే అత్యంత ప్రతిభ ఉన్న రిఫరీగా ఖ్యాతి గడించారు. ప్రపంచ కప్ పోటీలకు ప్రధాన న్యాయనిర్ణేతగా నియమితుడైన ప్రసాద్‌ను ఏపీ ఖోఖో సంఘం అధ్యక్షుడు టీఎస్ఆర్కే ప్రసాద్, కృష్ణాజిల్లా సంఘం చైర్మన్ యలవర్తి శ్రీనివాస్, కామన్‌బోర్డు కార్యదర్శి షేక్ జాన్‌సాహెబ్, గుడివాడ డీవైఈఓ ఐ.పద్మావతి అభినందించారు.

ఎస్సీ కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

చిలకలపూడి(మచిలీపట్నం): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 7వ తేదీతో గతంలో చెప్పిన గడువు ముగియటంతో మరో ఐదు రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు జనవరి 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా 16వ తేదీ వరకు నమోదు చేస్తారని, అనంతరం తుది కులగణన సర్వే వివరాలను 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారన్నారు. మండల ప్రత్యేకాధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ బాలాజీ ఆదేశించారు.

ఉత్సాహంగా రంగోత్సవ్ జిల్లా స్థాయి పోటీలు



గుడ్లవల్లేరు: రంగోత్సవ్ పేరిట జిల్లా స్థాయి సంప్రదాయ జానపద పోటీలను మంగళవారం అంగలూరులోని ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలతో పాటు జూనియర్ కాలేజీలు, ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాల బాలికలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జె.మోహినీకుమారి చెప్పారు. రంగోత్సవ్‌లో ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. క్విజ్, ముగ్గుల పోటీలు, డ్రాయింగ్, హేండ్ రైటింగ్, జానపద నృత్యం, స్లోగన్ రైటింగ్, రోల్ ప్లే, డిజిటల్ కోలేజ్ అంశాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు మోహినీ కుమారి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం లేనట్టే !

గత ఎన్నికల్లో ఇబ్బడిముబ్బడిగా సూపర్ సిక్స్ పేరిట నోటికి వచ్చినన్ని హామీలను ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు వాటిని నెరవేర్చలేక నాలుక కరచుకుంటున్నారు. గతేడాది జూన్‌లో అధికారంలోకి వచ్చినా... తల్లికి వందనం కూటమి ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. ఈ ఏడాదికి సంబంధించిన విద్యా సంవత్సరంలో ఇవ్వలేమని.. వచ్చే విద్యా సంవత్సర ఆరంభంలో జూన్‌లో ఇవ్వనున్నామని ఇటీవల బాబు స్పష్టం చేశారు. కానీ జిల్లా ప్రజలు ఈ ఆల్ ఫ్రీ బాబును నమ్మలేకపోతున్నారు. గతేడాది ఆగస్టు 15వ తేదీకల్లా మహిళలకు ఉచిత బస్సు అని హామీని ఇచ్చిన బాబు తుస్సుమని అనిపించడమే అందుకు నిదర్శనం. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిందే తడవుగా అన్ని పథకాలను అమలు చేశారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. తల్లుల ఖాతాల్లోకి ఏడాదికి రూ.15 వేలు చొప్పున జమ చేసి జిల్లా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.

- ఈ విద్యా సంవత్సరంలో లేదని తేల్చిన సీఎం చంద్రబాబు
- ఆల్ ఫ్రీ బాబు హామీలను నమ్మలేమంటున్న ప్రజలు
- జగనన్న పాలనలో జిల్లాలో రూ.2,105 కోట్ల జమ



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు(ఫైల్)

గుడ్లవల్లేరు: కూటమి ప్రభుత్వం తల్లికి వందనమని చెప్పి.. ఎగనామం పెట్టింది. తాము అధికారంలోకి వస్తే.. కుటుంబంలో చదువుకున్న పిల్లలందరికీ తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15వేలు చెల్లిస్తామని చెప్పిన చంద్రబాబు తొలి ఏడాది ఆ పథకం ఊసే లేకుండా చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.15 వేలు చొప్పున క్రమం తప్పకుండా అందుకునే వారమని విద్యార్థుల తల్లులు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబుతో పాటు ఆ కూటమి పార్టీల నాయకుల మాటలు విని తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా బాబు నిర్వాకం ఉంటే.. పిల్లలను చదివించేదెలా ? అని ఆందోళనకు గురవుతున్నారు.

వైఎస్ జగన్ పాలనలో ఘనంగా..

పేద విద్యార్థులను చదివించేందుకు ఏ తల్లీ ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం కింద కుటుంబంలో ఒకరికి రూ.15 వేల చొప్పున ఏటా క్రమం తప్పకుండా తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేసేవారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్న తేడా కూడా లేకుండా దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలందరికీ లబ్ధి కలిగించిన ఘనత వై.ఎస్.జగన్‌కే దక్కుతుంది. గత వైఎస్సార్ సీపీ పాలనలో 14 లక్షల మంది పిల్లలకు రూ.2,105 కోట్లు అందజేశారు.

ఆందోళనలో తల్లిదండ్రులు..

చంద్రబాబు తన సూపర్ సిక్స్ ఎన్నికల మేనిఫెస్టోలో పిల్లలను చదివించే బాధ్యత తాను తీసుకుంటానని తల్లికి వందనం పథకం కింద ఇంట్లోని ఎంతమంది పిల్లలు ఉంటే.. అందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారు.

గత జూన్‌తో 2024–25 విద్యా సంవత్సరం ఆరంభమైంది. దాదాపు నెల రోజులు దాటిన తర్వాత తల్లికి వందనం పథకం మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. బీపీఎల్ కుటుంబాలకు చెందిన తల్లులకు ఏడాదికి రూ.15 వేలు సాయం అందిస్తామని అందులో పేర్కొన్నారు. ఎంతమంది పిల్లలుంటే...అంతమందికీ అన్న విషయాన్నే ప్రస్తావించలేదు. విద్యార్థులకు 75 శాతం హాజరు నిబంధన పెట్టింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో తాము ఇంకా ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయలేదని కూటమి సర్కార్ మాట దాటవేసింది. ఆ తర్వాత వివిధ క్యాబినెట్ సమావేశాలు జరిగినా...ఆమోదం తెలుపలేదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని చర్చకు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది. దీనితో ఈ ఏడాదికి పథకానికి ఎగనామం పెట్టేసినట్లేనని జిల్లా ప్రజల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. చంద్రబాబు మాటలు నమ్మి నిలువునా మోసపోయామని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఈ ఏడాది నుంచే ప్రారంభించాలి..



తల్లికి వందనం పథకాన్ని ఈ ఏడాది నుంచే ప్రారంభించాలి. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలతో పేదలు సతమతమవుతున్నారు. తమను తాము బతికించుకునే దశలో ఉంటున్న పేద కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు పిల్లలను చదివించలేకపోతున్నారు. వెంటనే తల్లికి వందనాన్ని అమలు చేస్తేనే.. పేద పిల్లలు చదువుకోగలరు.

– ఎం.సాయికుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగాలి



పోరంకిలో ప్రాజెక్టులు పరిశీలిస్తున్న వి.విజయరామరాజు తదితరులు

పెనమలూరు: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుకోవడం ద్వారా లక్ష్యాలను సాధించగలుగుతారని కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్స్ డాక్టర్ వి.విజయరామరాజు అన్నారు. ఏపీ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పోరంకిలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో తమ మేధాశక్తిని ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లతో పాటు స్టెమ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సైన్స్, ఇంగ్లిష్, టెక్నికల్, మేథమేటిక్స్‌లో విద్యార్థులు ప్రావీణ్యత సాధించే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 26 జిల్లాల నుంచి మూడు విభాగాలుగా వ్యక్తిగత, టీమ్ విభాగం, ఉపాధ్యాయ విభాగంలో మొత్తం 156 ప్రాజెక్టులు ప్రదర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత విభాగం నుంచి 15, ఉపాధ్యాయ విభాగం నుంచి 10, ఉత్తమ ప్రాజెక్టులు 10 చొప్పున ఎంపిక చేశారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే దక్షిణ భారత స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంపిక చేసిన ప్రాజెక్టులు ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎన్టీఆర్ డీఈఓ యువీ సుబ్బారావు, కృష్ణా జిల్లా డీఈఓ విజయ్‌రామారావు, గుడివాడ డెప్యూటీ ఈఓ పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 27 మందికి ఉద్యోగాలు



అభ్యర్థులతో మాట్లాడుతున్న కంపెనీల ప్రతినిధులు

కురుమద్దాలి(పామర్రు): గ్రామంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 27 మందికి ఉద్యోగాలు లభించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), కృష్ణా జిల్లా ఉపాధి కల్పన శాఖ డీఆర్డీఏ– సీడాప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్‌లు పాల్గొని మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో బంధన్ బ్యాంక్ లిమిటెడ్, మెడ్ ప్లస్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. మొత్తం 41 మంది అభ్యర్థులు పాల్గొనగా వారిలో 27 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ మధు కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ సిబ్బంది టి.గుణరంజన్, వై.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ

రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న మంత్రి లోకేష్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ ఉందని, విద్యార్థుల ఆలోచనలకు వాస్తవ రూపమిచ్చే ఫ్యాకల్టీ ఉందనే విషయం పాలిటెక్ ఫెస్ట్‌తో రుజువైందని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న పాలిటెక్ ఫెస్ట్ 2024–25లో రెండో రోజు మంగళవారం లోకేష్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన టెక్ ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టును సందర్శించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఫెస్ట్ ఈవెంట్ కాదు.. మూమ్‌మెంట్

అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అటానమస్ ఫెయిర్ డిటెక్షన్ అండ్ ఎక్స్‌టింగిషర్ సిస్టమ్‌ను రూపొందించిన ఈశ్వర్, లక్ష్మీశరణ్యల పట్టుదల మిగిలిన విద్యార్థులకు ప్రేరణ అని పేర్కొన్నారు. ప్రయాణంలో ఒక్కోసారి ఎదురుదెబ్బలు తగులుతాయని, వాటి నుంచి కోలుకోవడం అనేది ముఖ్యమన్నారు. మన ఐటీఐలు, పాలిటెక్నిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తయారు కావాలని చెప్పారు. ఈ పాలిటెక్ ఫెస్ట్ అనేది ఒక ఈవెంట్ కాదని, మూమ్‌మెంట్ అన్నారు. రాజధాని ఒకే దగ్గర ఉండాలి, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి, ఒక ఎకో సిస్టమ్ ఏర్పడాలనేది ప్రభుత్వ విధానమని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక్కో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మంచి ఆలోచనలు ఉన్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. జీవితంలో చాలెంజ్ అనేది ఉండాలని, దానితోనే మనం ఎదుగుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, సాంకేతిక విద్య సంచాలకులు జి.గణేష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే విద్యుత్ బస్సులు



సదస్సులో మాట్లాడుతున్న ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ బస్సులను ప్రవేశ పెడుతుందని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జిలానీ బాషా అధ్యక్షతన 'విద్యుత్ బస్సుల నిర్వహణ నేరుగా ఆర్టీసీకే కల్పించాలి' అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. విద్యుత్ బస్సులను ఆర్టీసీ పరిధిలో కాకుండా ప్రైవేట్ రంగంలో తీసుకొస్తుండటంతో భవిష్యత్తులో ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. విద్యుత్ బస్సుల వచ్చాక వాటి నిర్వహణ వ్యయం కూడా ఎక్కువేనని, వాటితో ప్రజలపై చార్జీల భారం మోపుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఇక సమరం చేయాల్సిందేనని సూచించారు. విద్యుత్ బస్సుల వెనుక ఉన్న కుట్రలను ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. మొత్తం వాహనాల్లో 0.69 లోపు మాత్రమే ఆర్టీసీ బస్సులున్నాయని, ప్రభుత్వాలు కాలుష్యానికి ఆర్టీసీ బస్సులే ఎక్కువ కారణమన్నట్లు చిత్రీకరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగ సంఘాలతో చర్చించాలి..

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ బస్సుల పథకం ఆమోదిస్తే ఆర్టీసీ పూర్తిగా కనుమరుగవుతుందన్నారు. ఉద్యోగులు ఉపాధి కోల్పోతారని, ప్రజలపై మరింత భారాలు పెరుగుతాయని చెప్పారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా ఉద్యోగ సంఘాలతో చర్చించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఏపీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రామయ్య, రాజశేఖర్, శివకుమార్, రాములు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అహ్మద్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పునఃపరిశీలన

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య పింఛన్‌దారుల ధ్రువీకరణ, పునఃపరిశీలన ప్రక్రియ చేపడుతున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూ.15 వేల పింఛన్లు(వీల్ చైర్, మంచానికి పరిమితమైన బాధితులు) తీసుకుంటున్న వారి ధ్రువీకరణ, పునఃపరిశీలన ప్రక్రియను కలెక్టర్ లక్ష్మీశ మండలంలోని గుంటుపల్లిలో మంగళవారం పరిశీలించారు. పింఛన్ లబ్ధిదారుడు తుకారాం రాజాను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక బృందాలతో 358 పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామన్నారు. సర్వేకు జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు.

బాలికపై అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలికకు మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించిన రిక్షాపుల్లర్‌పై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రహ్మంగారి మఠం ప్రాంతానికి చెందిన దంపతులకు ఇద్దరు సంతానం. బాలిక(11) పెద్దమ్మ కుమారుడికి అనారోగ్యంగా ఉండటంతో షేక్ రాజా హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. సోమవారం రాత్రి అన్నను చూసేందుకు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో శ్రీనివాసమహల్ సమీపంలోని గంగానమ్మ గుడి వద్ద కోపెల బాలస్వామి అనే రిక్షా పుల్లర్ మాయమాటలు చెప్పాడు. రిక్షాలో ఇంటి వద్ద దింపుతానని నమ్మించి ప్రైజర్‌పేట కొండప్రాంతంలోని తన ఇంటికి తీసుకువెళ్లి తలుపులు వేసి అసభ్యకరంగా ప్రవర్తించసాగాడు. అయితే అప్పటికే బాలిక కనిపించడం లేదని తల్లిదండ్రులు గుర్తించారు. బాలిక రిక్షాలో వెళ్తుండటం చూసి అతని గురించి ఆరా తీశారు. రిక్షా పుల్లర్ ఇంటికి వెళ్లి బాలికను గుర్తించారు. ఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

'నా కుమారుడిది ముమ్మాటికీ హత్యే'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నా కుమారుడిది ముమ్మాటికీ హత్యేనని, కోడలు తన ప్రియుడితో కలిసి హత్య చేశారని సత్యనారాయణపురానికి చెందిన నిదానపు వసుంధర ఆరోపించారు. ఏలూరు లాకుల సమీపంలోని 5వ పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలో మంగళవారం ఆమె మీడియా ఎదుట తన గోడు వెళ్లబోసుకున్నారు. వివరాల్లోకి వెళితే సత్యనారాయణపురం రైల్వే క్వార్టర్స్‌లో నిదానపు సాయికుమార్, తన భార్య శ్యామలతో కలిసి నివాసం ఉంటున్నాడు. సాయికుమార్ రైల్వే ఉద్యోగి. గతేడాది నవంబర్ 17న సాయికుమార్ మృతి చెందాడు. ఈ విషయాన్ని సాయికుమార్ భార్య శ్యామల అత్త వసుంధరకు సమాచారం ఇచ్చింది. తన భర్త ఊపిరి ఆడక చనిపోయాడని తెలిపింది. అయితే అతని మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ వసుంధర సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. తన కొడుకు మృతికి కారకులైన కోడలు శ్యామల, ఆమె ప్రియుడు సోలం సైకిలాబ్‌ను పోలీసులు ఏ విధమైన విచారణ చేయకుండానే వదిలేశారని తెలిపారు. భార్య, ఆమె ప్రియుడు నుంచి తనకు ప్రాణహాని ఉందని సాయికుమార్ పలుసార్లు తనకు చెప్పాడని ఆమె తెలిపింది. పోలీసుల విచారణ తీరుపై అనుమానాలు లేవనెత్తారు. దీనిపై ప్రశ్నించిన తమపైనే ఎదురు కేసులు పెడతామని పోలీసులు బెదిరించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసును నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తన కోడలు, ఆమె ప్రియుడి నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆమె పోలీస్ కమిషనర్‌ను కోరారు.

రాజ్యాంగం పెను ప్రమాదంలో ఉంది

కేరళ మాజీ మంత్రి ఎంఏ బేబి



రాజ్యాంగం మనకేమిచ్చింది పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేరళ మాజీ మంత్రి బేబి, నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారత రాజ్యాంగం దేశంలోని కొన్ని శక్తుల కారణంగా పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటోందని కేరళ విద్యాశాఖ మాజీ మంత్రి ఎంఏ బేబి అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా ప్రజాశక్తి ప్రచురించిన జస్టిస్ హెచ్ఎన్ నాగమోహనదాస్ రచించిన 'రాజ్యాంగం మనకేమిచ్చింది' పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం ప్రధాన వేదికపై జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఏ బేబి పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక మంది మేధావులు ఎన్నో చర్చలు, సమావేశాల అనంతరం ఆమోదించిన రాజ్యాంగాన్ని మనుస్మృతి కోణంలో నేడు ప్రశ్నించడం దారుణమన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుపై ఉందన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పని చేసిన చంద్రచూడ్ వంటివారు ఇచ్చిన కొన్ని తీర్పులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు.

దురదృష్టవశాత్తు ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ వంటి శక్తులు దేశంలోని అన్ని వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని తద్వారా దేశంలోని కొన్ని వర్గాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాగమోహనదాస్ తన రచనలో రాజ్యాంగంలో నేటి పరిస్థితుల్లో ఎదురవుతున్న సవాళ్లను నేర్పుగా వర్ణించారన్నారు. సభకు అధ్యక్షత వహించిన బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సంపర దుర్గా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతో పటిష్టంగా నిర్మించిన మన రాజ్యాంగం మౌలిక స్వభావాన్నీ, దానికి ఎదురవుతున్న సవాళ్లనూ తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్ హౌస్ మేనేజర్ కె.లక్ష్మయ్య, బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి టి.మనోహర్‌నాయుడు, సాహితీవేత్తలు అచ్యుతరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌లో పుస్తకాలను చూస్తున్న యువతులు

హక్కుల కోసం ఉద్యమించిన యోధుడు సాయిబాబా



కామ్రేడ్ సాయిబాబా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వసంతకుమారి, ప్రసాద్ తదితరులు

హక్కుల కోసం పోరాడిన ఉద్యమకారుడిగా సాయిబాబా ప్రజాస్వామ్య విలువలను నమ్మే వారందరికీ ఆదర్శప్రాయుడని ఆయన సహచరి ఏఎస్ వసంతకుమారి అన్నారు. సాహిత్య వేదిక మీద విప్లవ రచయితల సంఘం ప్రచురించిన అరుణతార ప్రత్యేక సంచిక 'ప్రపంచ విప్లవ మానవుడు కామ్రేడ్ సాయిబాబా'ను సాయి బాల మిత్రుడు కేఎంఎంఆర్ ప్రసాద్ ఆవిష్కరించారు. అదే వేదికపై సాయిబాబా స్ఫూర్తి కవిత్వం నిండిన 'నువ్వెళ్లిన దారిలో' సాయి సహచరి వసంత కుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదానికీ, ప్రపంచీకరణకూ వ్యతిరేకంగా అనేక రచనలు చేశాడని చెప్పారు. సాయిబాబా ఆలోచనలనూ, ఆయన కలలనూ సాకారం చేసేందుకు మిత్రుల సహాయంతో ప్రయత్నిస్తామన్నారు. కేఎంఎంఆర్ ప్రసాద్ మాట్లాడుతూ పోలియోతో రెండు కాళ్లు పోగొట్టుకున్నా ప్రకృతిని ప్రేమించాడన్నారు. జైలులో ఉండి కూడా, తనతో పాటు విచారణ ఖైదీలుగా ఉన్న ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన మానవతావాది అని వివరించారు. కవితా సంచిక సంపాదకురాలు వైష్ణవి శ్రీ, శ్రీరామ్ తదితరులు సభలో పాల్గొన్నారు.